క్లుప్తంగా

వైభవంగా ఒనువులమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో ఒనువులమ్మ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో ఒనువులమ్మ తల్లి జాతర వైభవంగా జరిగింది. ఆదివారం ప్రారంభమైన ఈ జాతర మంగళవారం అమ్మవారి నైవేద్యాలతో ముగిసింది. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన బంధువులతో తొర్రేడు కిటకిటలాడింది. కార్లు, ద్విచక్ర వాహనాలతో గ్రామ ప్రధాన రహదారి, అంతర్గత దారులు కిక్కిరిసిపోయాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి మీనానగరం, కాండ్రకోట వారు ఏర్పాటు చేసిన బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంగళవారం పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

త్రిముఖలింగేశ్వరుని కల్యాణం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతలమామిడి వద్ద శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామికి వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా అర్చకులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కల్యాణం అనంతరం ప్రసాద వితరణ చేశారు.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నంలో కొలువుదీరిన గొడుగులమ్మ జాతర ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. నర్సాపురం, కొత్త జంబూపట్నం, పశ్చిమగానుగూడెం గ్రామాల భక్తులు తరలివచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు.

పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన



శివరామపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

గోకవరం: మండలంలోని కామరాజుపేట పంచాయతీ పరిధిలోని శివరామపట్నం గ్రామంలో మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ జీవనశైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడతామని రైతులు, వ్యవసాయ కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని, సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. మల్లవరం అటవీశాఖాధికారి వెంకట్రావు, సూదికొండ బీటు అధికారి డి.కామేశ్వరరావు, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

పెదపూడి: పెదపూడిలో ఈ నెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులచౌదరి మంగళవారం తెలిపారు. 18న ఉదయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టేబుల్ టెన్నిస్‌లో ప్రభాత్‌సాయి సత్తా

ప్రకాశం నగర్: విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్లేఫీట్ టీమ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్‌లో నగరానికి చెందిన ప్రభాత్ సాయి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు కోచ్ వేణుగోపాల్ మంగళవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. ఈ లీగ్‌లో ఆరు జట్లు తలపడ్డగా ఎస్‌ఎంఎస్ డెంటల్ గ్రూప్ విజయం సాధించిందని, ఈ జట్టులో ప్రతిభ కనబరిచిన ప్రభాత్ సాయిని కోచ్‌లు వీటీ సుబ్బారావు, అప్పిరెడ్డి, భీమ్ అభినందించినట్లు చెప్పారు.

తాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలి

సీటీఆర్ఐ: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా కార్మికులకు, శ్రామికులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు, మజ్జిగను యాజమాన్యాలు అందుబాటులో ఉంచాలని సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ అన్నారు. మంగళవారం స్థానిక లాలాచెరువు వద్ద గల స్పిన్నింగ్ మిల్లులో తాగునీటి సదుపాయాలు పరిశీలించి ఆయన పలు సూచనలు చేశారు. దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలు, నిర్మాణాలు చేపడుతున్న యాజమానులందరూ ఈ చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ నుంచి రక్షణకోసం కార్మికులకు వీలైనంత వరకూ పనివేళల్లో మార్పు చేయాలన్నారు. వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు.

వేసవి దుక్కులతో భూమికి రక్షణ

- తెగుళ్ల బెడద తగ్గుముఖం
- అధిక దిగుబడి వచ్చే అవకాశం



నరేంద్రపురంలో వేసవి దుక్కులు చేస్తున్న దృశ్యం

రాజానగరం: భూమి సారంగా ఉంటేనే దిగుబడులు బాగుంటాయి. వరుసపెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే, కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. అందుకనే మన పూర్వీకులు ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పండించిన భూముల్లో వేసవిలో దుక్కులు చేపట్టి, భూసారాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసేవారు. ఆధునిక కాలంలో భూములను పిండి దిగుబడులు తీసుకోవడానికే చూస్తున్నారుగానీ, భూసారాన్ని వృద్ధి చేయడానికి ప్రయత్నించడం లేదు. రబీ పంట తరువాత వేసవిలో ఆయా భూముల్లో దుక్కులు చేపట్టడం వలన బహుళ ప్రయోజనాలున్న సంగతిని విస్మరిస్తున్నారు. కానీ వ్యవసాయంపై మక్కువ, ఆసక్తి ఉన్న కొందరు రైతులు తమ పూర్వీకుల పద్ధతులను అనుసరిస్తూనే అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు.

లాభదాయకం

ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తమయ్యే పొలాలలో ఈ వేసవి దుక్కులు చేయడం ఎంతో లాభదాయకం. మెట్ట ప్రాంతంలో ముఖ్యంగా వరి సాగులో ముందుండే రాజానగరం మండలం నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, వెలుగుబంద, గండేపల్లి మండలం మురారి, గండేపల్లి గ్రామాలలో రైతులు చాలామంది వర్షాలు కురిసిన వెంటనే ఈ వేసవి దుక్కులు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రతతో భూములు కూడా భగభగమంటూ కాగిపోతున్న తరుణంలో దుక్కులు చేయడం ఎలాగని చాలామంది రైతులకు సందేహాలు రావొచ్చు. అయితే బోర్లు, సాగునీటి సదుపాయాలు ఉన్న వారికి ఈ సమస్య ఉండదు. మిగిలిన వారు కాస్తోకూస్తో వర్షాలు పడిన తరువాత చేపట్టవచ్చు. వేసవిలో దుక్కులు చేపట్టి, పశువుల పెంట వేయడం ద్వారా ఆయా భూములలో భూసారం వృద్ధి చెందుతుంది. తద్వారా సాగు చేసే పంటలు మంచి దిగుబడులు వస్తాయి.

ప్రయోజనాలు

- వేసవిలో పొలాలను దుక్కు చేయడం వలన పెరిగిన గడ్డి నశించడంతో పాటు వరిమోళ్లు కుళ్లి భూమిలో కలిసిపోయి ఎరువులుగా మారతాయి.
- భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి వస్తాయి. వాటిని పక్షులు ఆహారంగా తింటాయి. దీంతో తదుపరి వేసే పంటలకు పురుగుల నుంచి నష్టం వాటిల్లదు. పక్షులు ఆహారంగా తీసుకోగా మిగిలిన పురుగులు వేసవి ఎండల తీవ్రతకు చనిపోతాయి.
- తెగుళ్లకు కారణమయ్యే శిలీంధ్రాలు కూడా ఈ ఎండలకు చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తరువాత సాగు చేసే పంటలకు తెగుళ్ల బెడద లేకుండా నివారించవచ్చు,
- దుక్కు చేసిన పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూమి సారాన్ని కూడా పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఎంతో మంచిది



పొలాల్లో విరామం లేకుండా పంటలు పండిస్తూ పోతుంటే వాటిలో సారం కరిగిపోయి, నిస్సారంగా తయారవుతాయి. ఈ సమస్యను నివారించేందుకు పొలాలలో వేసవి దుక్కులు చేపట్టడం ఎంతో అవసరం. రబీ తరువాత అపరాలు సాగుచేసే భూములలో కాకుండా ఖాళీగా ఉంచిన పొలాలలో వేసవి దుక్కులు చేయాలి.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

తాపాన్ని తగ్గించే తాటి ముంజెలు



తాటి ముంజెలు తీస్తున్న అమ్మకందారు

అనపర్తి: సూరీడు నిప్పులు చెరుగుతున్నాడు. భానుడి భగభగలకు ఉదయం 10 దాటిందంటే ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. అనపర్తిలో మంగళవారం అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు పళ్లరసాలు, కొబ్బరినీళ్లతో పాటు తాటి ముంజెలపై మొగ్గు చూపుతున్నారు. దీంతో ఎండ వేడిమిలా వేసవిలో విరివిగా లభించే తాటి ముంజెల ధరలు సైతం పెంచేశారు. ప్రస్తుతం డజను ముంజెలు రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతున్నాయి. అధిక శాతం ఖనిజ లవణాలు కలిగిన తాటి ముంజెల్లో 87 శాతం నీరు ఉంటుందని, వీటిని తినడం వల్ల ఉష్ణోగ్రత తగ్గి జీర్ణక్రియ మెరుగుపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలనేది ప్రజాకాంక్ష

- రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్
- గండ్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం



గండ్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ బోస్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలనేది రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండలంలోని గండ్రేడులో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజలు ఎంపీ సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిలకు అడుగడుగున బ్రహ్మరథం పట్టారు. హారతిలిచ్చి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిద్దరూ ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి నిస్వార్థం, నిజాయతీ గల ఎమ్మెల్యే అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా జగన్‌ను, ఎమ్మెల్యేగా సూర్యనారాయణరెడ్డిని ఆదరణ, మద్దతు తెలియజేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలందరూ ఆశీర్వదించాలన్నారు. ఏ గడపకు వెళ్లిన సంక్షేమ పథకాల అమలుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ కుడిపూడి మాధవీలత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, కేతా శ్రీను, వాసంశెట్టి మాధవ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

రాజానగరం: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. కథలు చెప్పడం, కథలు చదివించడం, నీతి పద్యాలు నేర్పడం, చెప్పించడం, తెలుగు పదాలు నేర్పడం, పేపరుతో క్రాఫ్ట్స్ (బొమ్మలు, ఇతర వస్తువులు) తయారు చేయించడం వంటి అనేక కృత్యాలను చేయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్లుగా బి.నాగలక్ష్మి, పి.భారతి వ్యవహరించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు జరుగుతున్న ఈ శిక్షణ తరగతులు జూన్ 11 వరకు జరుగుతాయని లైబ్రేరియన్ కె.సత్యనారాయణ తెలిపారు.

డెంగీ నివారణకు సహకరించాలి



గోకవరంలో డెంగీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ



రంగంపేటలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: డెంగీ వ్యాధి నివారణకు వైద్య సిబ్బందితో పాటు ప్రజలు సహకరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గోకవరంలో డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో వైద్య సిబ్బంది మాట్లాడుతూ దోమల నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, హెచ్‌ఈ శైలజ, సూపర్‌వైజర్ అశోక్, లక్ష్మీకాంతం, వైద్య సిబ్బంది పవన్, రమణ, వైఎస్సార్ సీపీ నాయకుడు తోలేటి రాంప్రసాద్ పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

రంగంపేట: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రంగంపేటలో డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.లావణ్య ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఆడ ఏడీస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వ్యాధి వస్తుందని, ఈ దోమ పగటి పూట మాత్రమే కుడుతుందన్నారు. అందుకే ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని పలు వీధుల్లో డెంగీ నివారణపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అనూష, సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్‌ఓ శంకర్, పీహెచ్‌ఎన్ గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



సీతానగరంలో వైద్య సిబ్బంది ర్యాలీ

సీతానగరం: ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు సూచించారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ డెంగీ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో డెంగీపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ డెంగీ సోకితే జ్వరంతో పాటు తలనొప్పి తీవ్రంగా ఉంటుందన్నారు. రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి, రోగి ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.రాధాకృష్ణ, సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతే రాజు



మాట్లాడుతున్న మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు

మధురపూడి: జగన్ సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతే రాజు అని వ్యవసాయ సలహా మండలి కోరుకొండ మండల చైర్మన్ క్రొవ్విడి సర్రాజు అన్నారు. రాబోయే ఖరీఫ్‌లో వ్యవసాయశాఖ అధికారులు, సలహా మండలి నాయకులు సమష్టిగా పనిచేసి, రైతన్నలకు అండగా నిలుద్దామన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళ వారం ఆయన అధ్యక్షతన సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్రాజు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతులకు భరోసాగా ఉందని, ఆర్‌బీకేల ద్వారా మద్దతు ధరలకే పంటను కొనుగోలు చేస్తోందన్నారు. విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులను పరీక్షించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాబోయే కాలంలో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి సమావేశానికి వ్యవసాయరంగానికి అనుబంధంగా ఉండే విద్యుత్, ఇతర శాఖల అధికారులను హాజరయ్యేలా కృషిచేయనున్నట్టు తెలిపారు. దోసకాయలపల్లి తదితర గ్రామాల్లో లైన్‌మెన్లను నియమించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కోరతామన్నారు. వచ్చే రబీలో మెట్ట ప్రాంతంలో చిరుధాన్యాలు పండించేందుకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, మండలాధికారి ఏ.గౌరీదేవి, తహసీల్దార్ పాపారావు, పశుసంవర్ధకశాఖ బూరుగుపూడి డాక్టర్ వనిత, సలహామండలి సభ్యులు తనకాల ప్రసాద్, సన్నపురత్తయ్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

రాణా సెంటర్ వంతెనకు మోక్షం

- నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు
- ఏళ్ల తరబడి తిష్ట వేసిన సమస్యకు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



గోకవరం రాణా సెంటర్‌లో ఊర కాలువపై బ్రిటిషు కాలం నాటి వంతెన

గోకవరం: మండల కేంద్రమైన గోకవరం రాణా సెంటర్‌లో కొంతకాలంగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది. రాణా సెంటర్‌లో ఊరకాలువపై ఉన్న బ్రిటిషు కాలం నాటి ఇరుకు వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. దీంతో దశాబ్దాల కాలంగా నెలకొన్న సమస్య పరిష్కారం కానుంది. రాణా సెంటర్లో ఉన్న వంతెనను సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మించారు. చాలా ఏళ్ల క్రితమే ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. నిత్యం ఈ వంతెనపై రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన ఇరుకుగా ఉండటంతో ఒక్కోసారి వాహనాలు రక్షణ గోడలను ఢీకొంటున్నాయి. రక్షణ గోడలు బీటలు వారడంతో వంతెన కూలుతుందేమోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన ఇరుకుగా ఉండటం వంతెనకు ఇరువైపులా భారీ మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు సైతం సంభవిస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ వంతెనపై జరిగిన ప్రమాదాల్లో అనేకమంది మృత్యువాత పడగా గాయాలపాలైన వారు చాలామంది ఉన్నారు. వంతెన వద్ద నిత్యం ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఒక్కోసారి వంతెనపై భారీ వాహనాలు నిలిచిపోయి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించాలని అనేక పర్యాయాలు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆందోళనలు సైతం చేపట్టారు. ఇక్కడ వంతెన నిర్మించడానికి ఎనిమిదేళ్ల క్రితం ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రూ.కోటి వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు ఆహ్వానించారు. కానీ ఆ నిధులతో వంతెన నిర్మాణం పూర్తికాదంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు.

రూ.10 కోట్లు మంజూరు

ఏళ్ల తరబడి సమస్యగా ఉన్న ఈ వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించడానికి రూ.10 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు 516–ఇ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రాణా సెంటర్‌లో ఉన్న వంతెనను నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినట్టు ఇటీవల కాకినాడ ఎంపీ వంగా గీత తెలిపారు. త్వరలోనే టెండరు ప్రక్రియ పూర్తి చేసి వంతెనకు శంకుస్థాపన చేయనున్నామన్నారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గోకవరం ప్రజలతో పాటు ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

త్వరలో టెండరు ప్రక్రియ

వంతెన నిర్మించేందుకు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో టెండరు ప్రక్రియ చేపడతాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే వంతెన నిర్మాణ పనులు చేపడతాం.

– శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ

ట్రాఫిక్ కష్టాలు తీరతాయి

రాణా సెంటర్‌లో వంతెన ఇరుకుగా ఉండటంతో ప్రతీ రోజు ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఆదివారం ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. వంతెన నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ కష్టాలు తీరతాయి.

– జి.మనీష్ కుమార్, గోకవరం